క్లుప్తంగా

గొడవలకు దిగితే సహించేది లేదు


వెంకటేశ్వర్లు, డీఎస్పీ, కడప

సిద్దవటం : మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణంలో ఉండాలని, ఎవరైనా కక్షపూరిత గొడవలకు దిగినా, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిపై కఠినచర్యలు తప్పవని కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలం కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని నేకనాపురం డేగనవాండ్లపల్లి, మాచుపల్లె తదితర గ్రామాలపై పూర్తి స్థాయిలో నిఘావేసి ఉంచామన్నారు. ఎటువంటి గొడవలకు దిగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ చిరంజీవి, పోలీసులు పాల్గొన్నారు.

స్కిల్ హబ్‌ను సద్వినియోగం చేసుకోండి

రాయచోటి టౌన్ : పట్టణంలోని పాలిటెక్నికల్ కళాశాలలో ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభిస్తున్న స్కిల్ హబ్‌ను నిరుద్యోగ యువతీయువకులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ శివశంకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న నిరుద్యోగుల జీవనోపాధి కల్పించేందుకు ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) రాయచోటి పాలిటెక్నికల్ కళాశాలలో స్కిల్ హబ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సును మూడు నెలలపాటు ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ ఆపై చదువు చదివిన యవతీయువకులు అందరూ అర్హులే అన్నారు. శిక్షణ మూడు నెలల కాల వ్యవధి ఉంటుందని చెప్పారు. శిక్షణ పూర్తిచేసిన తరువాత జీవనోపాధి కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు

రాయచోటి అర్బన్ : ఈనెల 21, 22 తేదీలలో మదనపల్లె పట్టణంలో జరుగనున్న ఎస్ఎఫ్ఐ అన్నమయ్య జిల్లా ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి సర్వేపల్లె నరసింహ కోరారు. బుధవారం పట్టణంలో ఎస్ఎఫ్ఐ నేతలతో కలసి మహాసభ కరపత్రాలను విడుదల చేశారు. మదనపల్లె వేదికగా జరుగనున్న మహాసభలో ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ ఉద్యమ కార్యాచరణకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, రాయచోటి ఎస్ఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు గురునాథ్, సాయిచరణ్, ఉపాధ్యక్షుడు పవన్‌నాయుడు, నేతలు రాజేష్, బాలాజీ, నాగేంద్ర, అరుణ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ అధ్యాపకురాలికి డాక్టరేట్


చెంగమ్మ

రాజంపేట : అన్నమాచార్య యూనవర్సిటీలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న పోలిచెర్ల చెంగమ్మకు డాక్టరేట్ పొందారు. ఉత్తరప్రదేశ్ షికోహాబాద్ జెఎస్ యూనవర్సిటీ వారిచే పీహెచ్‌డీ ప్రదానం చేసినట్టు ప్రిన్సిపల్ డా.నారాయణ తెలిపారు. ఎక్స్‌ప్లోరింగ్ ది ఇంపాక్ట్ ఆఫ్ ఏఐ ఆన్ రిమోట్ వర్క్ ఎఫీసియన్సీ అనే అంశంపై చెంగమ్మ పరిశోధన చేశారన్నారు. జెఎస్ యూనవర్సిటీ అసోసియేట్ ప్రొఫసర్ డా.శరత్‌బాబు దుగ్గిరాల ఆధ్వర్యంలో పీహెచ్‌డీ రావడం పట్ల చెంగమ్మను ఏయూ చాన్సలర్ చొప్పా గంగిరెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డిలు అభినందించారు.

ఇ-పంట నమోదు చేసుకోవాలి

రామాపురం : మండలంలోని నల్లగుట్టపల్లె గ్రామం కర్ణపువాండ్లపల్లె, సరస్వతిపల్లెలో గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం ఉద్యానశాఖాధికారి టి.నాగమణి ఆధ్వర్యంలో నిర్వహించారు. మాట్లాడుతూ ప్రస్తుత రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలకు ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు. మామిడిలో పూత ఒకేసారి రావడానికి ఆడ పూలశాతం త్వరగా పెరగడానికి సూచనలు పాటించాలన్నారు. టమాటకు పంట బీమా ఎకరాకు రూ.1600 చెల్లించినట్లయితే రూ.32వేలు పంట బీమా వర్తిస్తుందని, డిసెంబర్ 15వ తేదీలోపు రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని తెలియజేశారు.

'ఉల్లాస్'పై శిక్షణా తరగతులు

పుల్లంపేట : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉల్లాస్ కార్యక్రమంపై వెలుగు, ఐసీడీఎస్ సిబ్బందికి ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయశ్రీ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అక్షరాస్యతను, సాంకేతిక అక్షరాస్యతను, న్యాయపరమైన అంశాలకు సంబంధించి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, వెలుగు ఏపీఎం, విస్తరణాధికారి కె.ముత్తయ్య, నారాయణ, డిజిటల్ అసిస్టెంట్ మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లు.. నరకానికి నకళ్లు

- పట్టించుకోని అధికారులు, నాయకులు
- రోడ్లు బాగు చేయాలంటున్న వాహనదారులు


దుద్యాల - నాయనవారిపల్లె రోడ్డు మార్గంలో మడుగును తలపిస్తున్న వర్షపునీరు


బండకాడ హరిజనవాడ సమీపంలో రోడ్డుపై నిల్వ ఉన్న నీరు

సంబేపల్లె : మండలంలో అంతంత మాత్రంగా ఉన్న రహదారులపై ఫెంగల్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు రోడ్లు ఛిద్రమయ్యాయి. నాలుగు రోజుల పాటు తేలికపాటి వర్షం కురవడంతో రోడ్లపై మోకాలి లోతు గుంతలు ఏర్పడ్డాయి. వర్షం నీరు గుంతల్లో నిలిచి మడుగులను తలపిస్తున్నాయి. దీంతో గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్ల దుస్థితి ఎప్పుడు మారుతుందో.. నాయకులు, అధికారులు ఈ మార్గాల గుండా ప్రయాణిస్తున్న తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో మండల ప్రజలు అస్పహనం వ్యక్తం చేస్తున్నారు.

అధ్వానంగా ఉన్న మార్గాలు..

మండల పరిధిలోని వివిధ గ్రామాలలోని తారు రోడ్లు గుంతలు ఏర్పడటంతో వర్షపు నీరు నిల్వ ఉండటంతో ప్రయాణించాలంటే నరకంగా మారాయి. మండలంలోని దేవపట్ల నుంచి వంకవారిపల్లె, దిగవ రాజువారిపల్లె, హరిజనవాడ మీదుగా చిన్నబిడికి వరకు, శెట్టిపల్లె కస్పా నుంచి సరిపిరాళ్లపల్లె మీదుగా యర్రమోరంపల్లె, శెట్టిపల్లె నుంచి దుద్యాల కోటకాడపల్లె లింకు రోడ్డు వరకు నిత్యం ఆటోలు, ద్విచక్రవాహనదారులు ప్రయాణం సాగిస్తుంటారు. వర్షం కురిసినప్పుడు రహదారులు పూర్తిగా తారు లేచిపోయి గుంతలు ఏర్పడి నీళ్లు నిలబడుతుండటంతో వాహదారులు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ గుంతలో పడి ఏ ఆస్పత్రికి వెళతామో తెలియని పరిస్థితి ఉందంటూ వాపోతున్నారు.


చిన్నజంగంపల్లె సమీపంలో వర్షం నీరు నిల్వడంతో నరకంగా మారిన రోడ్డు


దారుణంగా ఉన్న చిన్నబిడికికి వెళ్లే మార్గం

కూటమి పాలనలో విద్యారంగం నిర్వీర్యం


ఆకేపాటి మద్దతు కోరుతున్న ఏబీవీపీ నాయకులు

రాజంపేట టౌన్ : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం తాము చేపట్టే ఉద్యమాలకు మద్దతు ఇవ్వాలని ఏబీవీపీ నాయకులు మంగళవారం ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డిని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి మాట్లాడారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు విద్యార్థుల మధ్యాహ్న భోజనం పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో సౌకర్యాలను కల్పించారన్నారు. అయితే కూటమి ప్రభుత్వం విద్యావ్యవస్థను గాలికి వదిలేయడంతో గాడితప్పిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏబీవీపీ రాష్ట్ర సెక్రటరీ కె.మల్లికార్జున మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించడం ఆనందంగా ఉందన్నారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేష్ తనశాఖపై దృష్టిసారించడం కంటే ఇతర శాఖలపై ఎక్కువగా దృష్టిసారిస్తూ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలకు ఉప కులపతులను నియమించాలని, సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో ప్రస్తుత ధరలకు అనుగుణంగా మెస్‌ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచడంతో పాటు మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని, తల్లికివందనం పథకాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

పంటల బీమా చెల్లించాలి

సిద్దవటం: రబీలో పంటలు సాగు చేసే రైతులు తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి కె.రమేష్‌రెడ్డి తెలిపారు. మండలంలోని జ్యోతి, పొన్నవోలు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఏఓ మాట్లాడుతూ పంటల బీమా ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, ఉత్పత్తుల కొనుగోలు, యాంత్రీకరణ తదితర ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలంటే తప్పనిసరిగా ఇ-పంట నమోదు చేసుకోవాలన్నారు. పంట బీమా వరికి డిసెంబర్ 31వ తేదీ, ఇతర పంటలకు డిసెంబర్ 15వ తేదీ లోపు ప్రీమియం చెల్లించాలన్నారు.

నీరు నిల్వలేకుండా చూసుకోండి

ఓబులవారిపల్లె : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు పంట పొలాల్లో వర్షపునీరు నిల్వ లేకుండా చూడాలని ఏఓ మల్లిక రైతులతో అన్నారు. మంగళవారం పెద్దఓరంపాడు, చిన్నంపల్లి గ్రామాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అరటి, మామిడి, బొప్పాయి తదితర పండ్ల తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పెంచలయ్య, పుల్లయ్య, సుబ్బరాజు, గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

అండర్ బ్రిడ్జి పనులను పూర్తి చేయండి


రైల్వే సమస్యలపై డీఆర్ఎంకు వినతిపత్రం అందజేస్తున్న భరత్‌కుమార్ రెడ్డి


ఓబులవారిపల్లె : రాజంపేట పార్లమెంటు పరిధిలో నిర్మాణంలో ఉన్న రైల్వే అండర్ బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రైల్వే సమస్యలు పరిష్కరించాలని డీఆర్‌యూసీసీ మెంబర్ తల్లెం భరత్‌కుమార్ రెడ్డి మంగళవారం గుంతకల్లు రైల్వే డివిజన్ మేనేజర్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ అనంతరం రాజంపేట, నందలూరు, పుల్లంపేట, ఓబులవారిపల్లి, రైల్వేకోడూరు, రామాయపాలెం వద్ద ఎల్సీగేటు నెంబరు- 87 అండర్ బ్రిడ్జి వద్ద నీరు ఉందని గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, త్వరితగతిన సమస్య పరిష్కరించాలన్నారు. అలాగే కుక్కలదొడ్డి రైల్వే ట్రాక్ వద్ద ఉన్న ఎస్టీ భూములకు విద్యుత్ తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. అంతకుముందు డీఆర్ఎం విజయ్‌కుమార్‌ను శాలువా, పుష్పగుచ్ఛంతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కుక్కలదొడ్డి సర్పంచ్ బండివడ్ల పూర్ణమ్మ, బండి రమణయ్య, మహేష్ తదితరులు పాల్గొన్నారు.


ఎన్ఎంఎంఎస్ పరీక్షలు విజయవంతం


బహుమతులను అందజేస్తున్న రాఫ్‌బాషా

నందలూరు(రాజంపేట) : రాజంపేట డివిజన్‌లో ఎన్ఎంఎంఎస్ పరీక్షలు మంగళవారం విజయవంతమయ్యాయి. నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ నమునా పరీక్షలను ఏపీ స్కూల్స్ అసిస్టెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించామని రాజంపేట డివిజన్ కన్వీనర్ షేక్ రాఫ్‌బాషా తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 200 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారన్నారు. ఇందులో ప్రతిభ కనపరిచిన వారికి 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఏడాదికి రూ.12000 చొప్పున నగదు ప్రోత్సాహక బహుమతిగా ఇస్తారన్నారు.

ప్రత్యేక అవసరాల విద్యార్థులకు మెరుగైన సేవలు


ఓబులవారిపల్లె: విద్యార్థులకు బహుమతులు ఇస్తున్న ఎంఈఓ రెడ్డయ్య, కరస్పాండెంట్ యువరాజ్


పుల్లంపేట: కార్యక్రమంలో పాల్గొన్న విభిన్న ప్రతిభావంతులు

ఓబులవారిపల్లె : ప్రత్యేక అవసరాల విద్యార్థులకు భవిత సెంటర్ ద్వారా మెరుగైన సేవలు అందించడం జరుగుతుందని ఎంఈఓ రెడ్డయ్య పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ రెడ్డయ్య మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించాలన్నారు. ప్రత్యేక అవసరాల ఉపాధ్యాయురాలు కృష్ణవేణి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు పదోతరగతి వారికి అందిస్తున్నటువంటి సేవలు గురించి వివరించారు. శ్రీ రిషీ అప్పర్ ప్రైమరీ పాఠశాల యాజమాన్యం ప్రతి ఏడాది దివ్యాంగుల అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా భవిత సెంటర్‌లో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, టై, బెల్టులు బహుమతుతోపాటు మధ్యాహ్నం భోజనాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. ఇందుకు పాఠశాల కరస్పాండెంట్ టి.యువరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 రామయ్య, ఐఆర్‌టీఏలు స్వాతి, శ్రీనివాసులు, ఫిజియో థెరపిస్ట్ స్టీఫెన్ పెంచలయ్య, ఆయా టీచర్ దామోదరవల్లి తదితరులు పాల్గొన్నారు.

పుల్లంపేట : విభిన్న ప్రతిభావంతుల సమైక్య సేవా సంఘం పుల్లంపేట శాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఎస్‌బీవీడీ సభా ప్రాంగణంలో ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా సంఘం అధ్యక్షుడు మల్లు సుబ్బనరసారెడ్డి అధ్యక్షతన ఎంఈఓ తిరుమలరావు చేతులమీదుగా కేక్‌కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ఎస్‌బీవీడీ సభా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ బాలాజీ, సంఘం ఉపాధ్యక్షుడు వాహిద్, కోశాధికారి నరసింహులు, సభ్యులు ఆనంద్, శ్రీనివాసులు, జ్యోతీశ్వర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ ఉత్తమ కేడెట్లకు అభినందన


కేడెట్లను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఎన్‌సీసీ అధికారి

చిట్వేలి: జూనియర్ డివిజన్ విభాగంలో బెటాలియన్ ఉత్తమ కేడెట్లుగా ఎంపికై డీడీజీ జ్ఞాపికను పొందిన షేక్ మొబూహిద్, పులి దిలీప్ కుమార్‌లను అభినందించారు. మంగళవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు ఏబీఎస్ ప్రసాద్, ఎన్‌సీసీ అధికారి పసుపుల రాజశేఖర్‌లు ఎన్‌సీసీ కేడెట్లను అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థినీ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

వయోజనులకు విద్యను అందించాలి


ఓబులవారిపల్లె: మాట్లాడుతున్న ఏపీఎం మల్లికార్జున


చిన్నమండెం మండలంలో..

ఓబులవారిపల్లె : గ్రామీణ ప్రాంత వయోజనులందరిని విద్యావంతులను చేయాలని ఎంపీడీఓ మల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఉల్లాస్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మల్లికార్జున మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా వయోజనులందరికీ అవగాహన కల్పించి సాయంత్రం సమయంలో విద్యను అందించాలని మండలంలోని 60 సెంటర్లను ఎంపిక చేశారని, ఒక్కో సెంటర్‌కు పది మంది సభ్యులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు.

చిన్నమండెం : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఉల్లాస్ వయోజన విద్యా కార్యక్రమంపై శుక్రవారం అంగన్వాడీ టీచర్లు, వెలుగు సీసీలు, వీఓఏలు, అంగన్వాడీ సూపర్‌వైజర్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో మన ఆచార్య వ్యవహారాలు, పరిశుభ్రత, పరిశుభ్రత, ఆరోగ్యం తదితర అంశాలను వివరించారు. మండలంలో 38 వాలంటీర్లలో 380 మంది నిరక్షరాస్యులను గుర్తించగా వీరికి 3 నెలల పాటు రాత్రిపూట చదువు నేర్పించడం జరుగుతుందన్నారు.

అప్రమత్తంగా ఉండండి

సుండుపల్లె : మండల పరిధిలోని పింఛా జలాశయం నిండటంతో మంగళవారం నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసులు తన సిబ్బందితో కలిసి జలాశయం దిగువ ఉండే పరివాహక ప్రాంతాలను సందర్శించి జీవాలను వాగులలో దింపరాదని సూచించారు. నీటి ప్రవాహం తగ్గేవరకు వాగులలోకి రాకుండా అందరూ జాగ్రత్తగా ఉండాలని ఆయన హెచ్చరించారు. కానిస్టేబుల్ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫెంగల్ తుపాను బాధితులను ఆదుకోవాలి

రాయచోటి అర్బన్ : ఫెంగల్ తుపాను కారణంగా అన్నమయ్య జిల్లాలో నష్టపోయిన బాధిత రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో గత మూడురోజులుగా కురుస్తున్న వర్షాల వలన వరి, మొక్కజొన్న, అరటి, టమాటా, బొప్పాయి, బీన్స్, చామంతి పూలతోటలు తదితర పంటలన్నీ తడిసి ముద్ద అయినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా జిల్లాలో 2233.5 ఎకరాల్లో వరి, 20 ఎకరాల్లో మొక్క పంటను రైతులు నష్టపోయారన్నారు. మొత్తం 76 గ్రామాలలో 2176 మంది రైతులు రూ.1.54 కోట్ల విలువైన పంటను నష్టపోయినట్లు వ్యవసాయాధికారులు అంచనా వేశారన్నారు. కాగా వాస్తవంగా ఈ నష్టం మరింతగా పెరిగే అవకాశం ఉందన్నారు. ప్రధానంగా సాగు చేసిన వరిపంట కోత దశలో ఉందని, తుపాను ధాటికి చాలా ప్రాంతాల్లో పంట నేలవాలి నీటమునిగిందన్నారు. ఈ సంవత్సరంలో వర్షాభావంతో వేరుశనగ రైతులు, తుపాన్ కారణంగా వరి రైతులు పూర్తిగా నష్టపోయారంటూ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫెంగల్ తుపాను బాధితులను ఆదుకోవాలంటూ ఆయన డిమాండ్ చేశారు.

వయోజన విద్యా వలంటీర్ బాధ్యతలు మాకొద్దు

లక్కిరెడ్డిపల్లి : వయోజన విద్యా వలంటీర్ బాధ్యతలు మాకొద్దని అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ పద్మావతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు రోజువారి కార్యక్రమాలు, అంగన్‌వాడీ రిజిస్టర్లు, ప్రీ స్కూల్ కార్యక్రమాలు, పౌష్టికాహారం పంపిణీ, యాప్‌లలో డేటా నమోదు వంటి వాటితో అధిక పని భారం, ఒత్తిడితో సతమతమవుతుంటే అధికారులు వయోజన విద్యా వలంటీర్లుగా పనిచేయాలని చెబుతున్నారని, ఆ బాధ్యత నుంచి తమను మినహాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి, ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ, ప్రభావతి, రుక్మిణీ, శ్రీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : వయోజన విద్యా భారాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని మంగళవారం ఎంపీడీఓ విజయారావుకు అంగన్‌వాడీ కార్యకర్తలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే అంగన్‌వాడీలకు పనిభారం ఎక్కువగా పెట్టిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ వేతనంతో అన్ని పనులను అంగన్‌వాడీలకు అప్పగించడం సబబు కాదన్నారు.

పేదలకు నివాస స్థలాలు ఇచ్చేవరకు పోరాటం


అర్హులైన పేదలకు నివాస స్థలాలు ఇవ్వాలని వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

లక్కిరెడ్డిపల్లి : అర్హులైన పేదలకు నివాస స్థలాలు ఇచ్చేవరకు పోరాటం ఆగదని సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలకు నివాస స్థలాలు మంజూరు చేయాలని ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వివిధ గ్రామాల నుంచి పనుల నిమిత్తం పట్టణాల్లో నివసిస్తున్న చాలా మంది నిరుపేదలకు ఇప్పటికీ సొంత నివాసం లేక మానసికంగా ఆవేదన చెందుతున్నారని, నాటి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా 32 లక్షల మందికి నివాసస్థల పట్టాలు ఇచ్చామని గొప్పలు చెప్పుకున్నారే తప్ప ఆచరణలో సాధ్యం కాలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికలలో భాగంగా పట్టణాలలో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్ల స్థలాలు చూపించి వెంటనే ఐదు లక్షల రూపాయలు రుణం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి సుమిత్ర, ప్రమీల, సీపీఐ నాయకులు కె.ఓబులేసు, గణేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా గ్రామోత్సవం


ఉత్సవ విగ్రహాలకు అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, భక్తులు


రాజంపేట పట్టణంలో వైభవంగా జరుగుతున్న గ్రామోత్సవం

రాజంపేట రూరల్ : హరిహర పుత్రుడు అయ్యప్పస్వామి గ్రామోత్సవ వేడుకలను అయ్యప్పస్వామి దేవాలయం అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మలపెంట పాలప్రకాష్, రాఘవరెడ్డి వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి దేవస్థానాన్ని అరటిబోదలతో, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అదే విధంగా విద్యుత్ వెలుగులతో ఆలయం శోభాయమానంగా వెలుగొందింది. మంగళవారం ఉదయం నుంచే అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు జరిపారు. అనంతరం ఆలయానికి సంబంధించిన రథంలో గణపతి, సుబ్రమణ్యేశ్వరుడు, అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాలను అలంకరించి కొలువుతీర్చి గ్రామోత్సవాన్న ప్రారంభించారు. గురుస్వాములు చంద్రమౌళి, సత్యనారాయణ, నాగరాజులు రథంలో స్వామివారికి ప్రత్యేకంగా భక్తులు అందజేసే తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ గ్రామోత్సవం వెంట కన్యస్వాములు కలశాలతో వెంట నడిచారు. అలానే పాత బస్టాండ్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం వద్ద మహిళలు జ్యోతులతో గ్రామోత్సవంలో పాల్గొన్నారు. కాగా ఈ వేడుకలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆకేపాటి పాల్గొని ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు.

గౌరవించే సంస్కారాన్ని అలవరుచుకోవాలి


స్కాలర్‌షిప్ పొందిన విద్యార్థులతో బ్యాంక్ అధికారులు

రాజంపేట టౌన్ : ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను గౌరవించే సంస్కారాన్ని అలవరుచుకోవాలని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ రాజంపేట ఆర్ఎస్‌రోడ్డు శాఖ మేనేజర్ రవి తెలిపారు. స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన విద్యార్థినిలు విద్యలో ప్రతిభ చూపుతున్నందున విద్యాజ్యోతి పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ.5 వేల రూపాయల చెక్కును మంగళవారం మేనేజర్, పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ రవి, హెచ్ఎం జయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే చక్కటి సంస్కారాన్ని అలవరుచుకోవాలని సూచించారు. స్కాలర్‌షిప్ పొందిన వారిలో దండు గగనశ్రీ, రెడ్డిపాక భాగ్యశ్రీ, మల్లెంపల్లె హాసిని ఉన్నారు.